సాక్షి
జగిత్యాల
బుధవారం । 1 । జనవరి । 2025

హ్యాపీ న్యూ ఇయర్...

రాయికల్: థర్టీఫస్ట్ వేడుకలను జిల్లా ప్రజలు మంగళవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా అర్ధరాత్రి న్యూ ఇయర్ కేక్‌లు కట్ చేసి ఆనందంగా గడిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



న్యూస్‌రీల్

డీపీవోగా మధుసూదన్

జగిత్యాల: జిల్లా పంచాయతీ అధికారిగా మధుసూదన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్డీఏ పీడీగా ఉన్న రఘువరణ్ ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెల్సిందే. ఈ క్రమంలో మధుసూదన్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సన్న ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

సారంగాపూర్: సన్నాల కొనుగోళ్లను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. యాసంగి నాట్లు చురుకుగా సాగుతున్నందున రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే కొనుగోళ్లను పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట డీసీఎస్‌వో జితేంద్ర కుమార్, తహసీల్దార్ ముంతాజొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధర్మపురి బల్దియాలో 11 అంశాలకు ఆమోదం



సమావేశమైన సభ్యులు

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 11 అంశాలకు ఆమోదం తెలిపారు. పారిశుధ్య వాహనాలకు మరమ్మతు, గోదావరి వద్ద చెత్తను కుండీల్లో వేసేందుకు ఫ్లెక్సీల ఏర్పాటు, ఇంజినీరింగ్ విభాగంలో గేట్‌వాల్స్, పైపులైన్ల రిపేర్లు, వీధిదీపాలు, బ్లీచింగ్ పౌడర్, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు అంశాలను తీర్మానించారు. వైస్ చైర్మన్ రామన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు తదితరులున్నారు.

సేవా పతకానికి 8 మంది ఎంపిక



హెడ్‌కానిస్టేబుల్ రాములు

జగిత్యాలక్రైం: పోలీసుల శాఖలో విశేషంగా కృషిచేస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సేవా పతకానికి జిల్లా నుంచి 8 మందిని ఎంపిక చేశారు. సారంగా పూర్ హెడ్‌కానిస్టేబల్ రా ములు (అటాచ్డ్ డీఎస్పీ ఆఫీస్), జగిత్యాల డీ ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్ రాజు, సా రంగాపూర్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అహ్మద్‌మోహినొద్దీన్, జగిత్యాల ఏఆర్‌లో పని చేస్తున్న ఎండీ.నజీమొద్దీన్, జగిత్యాల డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సాహిద్ తఖీద్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు పోచయ్య, మోహన్‌లాల్‌కు సేవా పతకా లను ప్రకటిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

జగిత్యాలలో భారీ బందోబస్తు



బందోబస్తులో డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: న్యూఇయర్ సందర్భంగా పోలీస్‌శాఖ జిల్లా కేంద్రంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొత్తబస్టాండ్, పాత బస్టాండ్, టవర్ సర్కిల్, మంచినీళ్ల బావి, గొల్లపల్లి రోడ్డు, రాజీవ్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు కిరణ్‌కుమార్, గీత, మన్మథరావు, మల్లేశం, సీసీఎస్ పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రాయికల్: పట్టణంలో మొసరపు సంతోష్, కైరం సత్యం గురుస్వాముల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి సుధీర్‌శర్మ స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాపరులు పెద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి గాడిన పడేనా..?

- నిత్యం ఏదో ఒక సంఘటనలు
- ఇటీవల సూపరింటెండెంట్ సరెండర్
- జనరల్ ఆస్పత్రిపై ఫిర్యాదుల వెల్లువ
- వైద్యులు సమయపాలన పాటించేనా..?



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి... మెడికల్ కళాశాలకు అనుబంధం కూడా. ఈ ఆస్పత్రికి నిత్యం అనేక మంది ఔట్, ఇన్‌పేషెంట్స్ వస్తుంటారు. అలాంటి ఈ ఆస్పత్రికి ఏమైందో తెలియదుగానీ నిత్యం ఏదో ఒక సంఘటన జరుగుతోంది. ప్రజాప్రతినిధుల పట్టింపులేని ధోరణి, వైద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

బాలింతల్లో కలవరం..

మాతాశిశు సంక్షేమ కేంద్రానికి గర్భిణులు రావాలంటే జంకుతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో మహాలక్ష్మీ ఆస్పత్రిలో చేరగా.. సిజేరియన్ చేసి మగబిడ్డకు పురుడుపోశారు. ఆమెకు కుట్లు వేశాక తీవ్ర అస్వస్థతకు గురైంది. మరో గర్భిణికి సిజేరియన్ చేసి కడుపులోనే గుడ్డ పెట్టి కుట్లు వేశారు. ఇన్ఫెక్షన్ కావడంతో ఆ మహిళ మృతి చెందింది. ఆ నెలలోనే నలుగురు బాలింతలు తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఇద్దరు మరణించారు. నిత్యం ఇలా ఏదో ఒక సంఘటనలు ఆస్పత్రిలో కలవరపెడుతున్నాయి. గతంలో ఓ వృద్ధుడు చికిత్స పొందుతుండగానే పాతబస్టాండ్‌లో దింపేసి వెళ్లిపోయారు. ప్రజలు గొడవ చేయడంతో తిరిగి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించిన కలెక్టర్ సత్యప్రసాద్ అతడిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఇటీవలే సరెండర్ చేశారు.

మందుల టెండర్లలో సైతం ఆలస్యమే..

ఇటీవల ఆస్పత్రికి సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి మందులు కొనుగోలు చేశారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా ఉన్న అదనపు కలెక్టర్ టెండర్ల కోసం ప్రాసెస్ చేశారు. తుది ఆమోదం కోసం సూపరింటెండెంట్ ఫైల్ చేయకపోవడంతో అవి అలాగే ఆగిపోయాయి. జిల్లా కేంద్రంలో ప్రధానంగా రోగులకు అందించే ఆహారానికి సంబంధించిన డైట్ కాంట్రాక్టర్ గడువు ఈ ఏడాది సెప్టెంబర్ 28తో ముగిసింది. నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు దాని గురించి పట్టించుకోకపోవడంతో వారే కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నారు.

శానిటేషన్ అస్తవ్యస్తం

ప్రధాన ఆస్పత్రిలో శానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. వాష్‌రూమ్‌లు సరిగా లేవు. కొన్ని వాష్‌రూమ్‌లకు తాళాలు వేసి ఉంటున్నాయి. శానిటేషన్‌పై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి విషయంలో అలాగే ఉండటంతో ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు పడింది. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని, భవనాలకు వైట్‌వాష్ వేయాలని, అలాగే సిబ్బంది లేకపోతే ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు అందులో ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. మౌళిక వసతుల అభివృద్ధికి సైతం రూ.85 లక్షలు బడ్జెట్‌లో కేటాయించారు.

కాలం చెల్లిన మందులు

మాతా శిశు సంక్షేమ కేంద్రంలో ఇటీవల కాలం చెల్లిన మందులు బయటపడ్డాయి. సదరు సూపరింటెండెంట్, వైద్యాధికారులు వీటిని చూసుకోకపోవడం శోచనీయం. కొన్నిమందులు గడువు ముగిసి నెలలు గడుస్తున్నా వాటినే రోగులకు ఇస్తున్నారు. దీనిపై 'సాక్షి' కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించి వాటిని బయట పడేశారు. ఇటీవల సారంగాపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రికి రాగా ఆ సమయంలోనే ఈ కాలం చెల్లిన మెడిసిన్ బయటపడిన విషయం తెల్సిందే.

> 'జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రాజనర్సు అనే ఓ వృద్ధుడు గత శుక్రవారం చికిత్స పొందుతుండగా.. ఆయనకు తోడుగా అయన భార్య మల్లవ్వ ఆసరాగా ఉండేందుకు వచ్చింది. అదే సమయంలో హైబీపీతో పడిపోగా చికిత్స అందించాల్సిన వైద్యబృందం ఆమెను బయట దింపేశారు. విషయం మీడియాలో రావడంతో మళ్లీ ఆమెకు చికిత్స అందించారు. ఇలాంటి సంఘటనలు ఆస్పత్రిలో కోకొల్లలు..'

ఈసారైనా గాడిన పడేనా..?

ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సరెండర్ చేసిన నేపథ్యంలో ఈసారైనా ఆస్పత్రి గాడిన పడేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జి ఎవరికీ ఇవ్వలేదు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారి నుంచి ప్రస్తుతం ఉన్న సిబ్బంది చూసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే మెడికల్ కళాశాలకు ప్రిన్సిపల్ సైతం పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిసింది.

ఇసుక అక్రమంగా తవ్వితే చర్యలు



సాతారంలోని పెద్దవాగులో ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సత్యప్రసాద్
- సాతారంలో ఇసుకరీచ్‌ల పరిశీలన

మల్లాపూర్: జిల్లాలో ఇసుకను అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని సాతారం పెద్దవాగులో ఇసుక రీచ్‌ను రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుక తవ్వొద్దన్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు మూడు బృందాలు 24గంటలు తనిఖీలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో చేపడుతున్న సర్వే పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అన్నారు. మండలంలోని రేగుంటలో సర్వేను తనిఖీ చేశారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి జైసింగ్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ఇసుక అక్రమంగా తరలకుండా చెక్‌పోస్టులు

మెట్‌పల్లిరూరల్: ఇసుక అక్రమంగా రవాణా కాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దవాగును ఇసుక రీచ్‌గా గుర్తించగా.. మంగళవారం పరిశీలించారు.

బల్దియాలో వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న కమిషనర్, మున్సిపల్ చైర్మన్



పాల్గొన్న కౌన్సిలర్లు

రాయికల్: రాయికల్ బల్దియాలోని అన్ని వార్డుల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. బల్దియాలోని 12 వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యనిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 12అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు కన్నక మహేందర్, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరీబేగం, శ్రీరాముల సువర్ణ, మ్యాకల కాంతారావు, అనురాధ, కో–ఆప్షన్ సభ్యులు వనిత, మహేందర్, మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

యావర్‌రోడ్డు విస్తరణ తప్పనిసరి

- రూ.వంద కోట్లు విడుదల చేయండి
- ప్రభుత్వానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని యావర్ రోడ్డు విస్తరణ తప్పనిసరిగా మారిందని, ఈ క్రమంలో రూ.100 కోట్లు విడుదల చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. యావర్‌రోడ్డు విస్తరణ ఆవశ్యకత, నిధులు కేటాయింపుపై మంగళవారం ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణ జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రద్దీకి అనుగుణంగా యావర్‌రోడ్డును వంద ఫీట్లకు విస్తరించాలని, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపామని, పట్టణ అభివృద్ధి శాఖ సీఎం వద్దే ఉన్నందున యావర్ రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని లేఖ రాశానని తెలిపారు. యావర్‌రోడ్డు గతంలో 40 ఫీట్లుగా ఉండగా తన హయాంలోనే 60ఫీట్లకు విస్తరించానని గుర్తు చేశారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరిగితే ఉపేక్షించేదిలేదని, నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరిగేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, టీపీసీసీ ప్రతినిధి బండ శంకర్, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, ధర రమేశ్, చందా రాధాకిషన్, మన్సూర్, ఎంఏ.బారి, గుండ మధు, ముఖేష్‌ఖన్నా, చాంద్‌పాషా, బాస ప్రకాష్ తదితరులు ఉన్నారు.

'ముక్కోటి ఏకాదశి'కి రండి



ప్రభుత్వ విప్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 10న నిర్వహించే వైకుంఠ ఏకాదశికి రావాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. ఆలయం తరపున ఈవో శ్రీనివాస్, వేద పండితులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్‌ను కలిశారు. అడ్లూరికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

ధర్మపురిలో భాగవత గ్రంథాల వితరణ



వేద పండితులకు భాగవత గ్రంథాలను వితరణ చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం భాగవత గ్రంథాలను వితరణ చేశారు. హైదరాబాద్ ఇస్కాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 55 మంది వేద పండితులకు ఈ గ్రంథాలను బహూకరించారు. ప్రముఖ సంస్కృత పండితులు, విశ్రాంత లెక్చరర్ పెండ్యాల శంకర్‌శర్మ మాట్లాడుతూ.. భాగవత గ్రంథాల సారాన్ని ప్రతిఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు. భాగవతం పఠనంతో భక్తిభావం పెంపొంతుందని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, ఇస్కాన్ ప్రతినిధులు మాదవ గోపీనాథ్ దాస్, సుబ్బారావు, గుండి నర్సయ్యశర్మ, పెండ్యాల చంద్రశేఖర్, రాజేశ్, మహేందర్ తదితరులున్నారు.

వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు



పుస్తకం ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి నరేశ్

జగిత్యాలటౌన్: తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ అన్నారు. మంగళవారం ఐడీఓసీలోని సంక్షేమ అధికారి చాంబర్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన వయోధికుల సంరక్షణ చట్టం పుస్తకాలను ఆవిష్కరించారు. నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు సేవలు అందిస్తూ.. వారి సమస్యలను ఆర్డీవోల దృష్టికి తెస్తూ పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్ముల ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి, ఎండీ.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి అశోక్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శక సేవలు

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలుగా పోషణ్ ట్రాకర్ మొబైల్ అప్లికేషన్‌లో ఫేస్ అథెంటికేషన్ ఫీచర్‌ను జోడించినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బోనగిరి నరేశ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల్లో అందిస్తున్న సేవలతోపాటు లబ్ధిదారుల వివరాలన్నీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

చిరుత సంచారంపై అధికారుల అలర్ట్



రంగారావుపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రంగారావుపేట శివారులో చిరుత సంచారంపై ఫారెస్ట్ అధికారులు అలర్ట్ అయ్యారు. మూడు రోజుల క్రితం చిరుత ఓ కుక్కను పీక్కుతిన్న విషయం తెలిసిందే. దీంతో ఫారెస్ట్ అధికారులు మంగళవారం అటవీ ప్రాంతంలో మరోమారు గాలింపు చేపట్టారు. చిరుత ఇటీవల సంచరించిన వైపు మళ్లీ వచ్చిందా..? లేదా..? పాదముద్రలు ఏమైనా ఉన్నాయా..? అని పరిశీలించారు. చిరుత సంచరిస్తోందనే హెచ్చరిక ఫ్లెక్సీలను పలుచోట్ల ఏర్పాటు చేశారు.

ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఓంప్రకాశ్



జగిత్యాలజోన్: జగిత్యాల కోర్టు ఏజీపీగా నియమితులైన సీనియర్ న్యాయవాది ఓంప్రకాశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, ఆయా కోర్టుల జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఓంప్రకాశ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, న్యాయవాదులు పూలమాల, పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

కొత్త ఆలోచనలతో ముందుకు

'రోల్లవాగు' పూర్తిచేస్తా..

- అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూంలు పంపిణీ
- గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి
- న్యూఇయర్ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: రోల్లవాగు ప్రాజెక్టును పూర్తి చేయడమే తన లక్ష్యమని, వృత్తిరీత్యా డాక్టర్‌ను అయినా కొత్త సంవత్సరంలో ప్రణాళికతో ముందుకెళ్లి నియోజకవర్గంలో మిగిలిపోయిన పనులన్నీ పూర్తిచేసేలా కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తీసుకునే ప్రణాళికలపై 'సాక్షి'తో మాట్లాడారు. 'రోల్లవాగుతో దాదాపు 30వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. జిల్లాకేంద్రంలో మాస్టర్‌ప్లాన్ అమలు చేసేలా చూస్తా. జిల్లాకేంద్రంలో అండర్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ముఖ్యమంత్రిని కలిశాను. యావర్‌రోడ్ విస్తరణ, రింగ్‌రోడ్ ఏర్పాటు చేసేలా చూస్తా. లింగంపేట రైల్వేస్టేషన్‌లో రూ.2 కోట్లతో ఉద్యానవనం ఏర్పాటుచేశాం. బల్దియాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు శ్రీకారం చుడతాం. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి.

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా..

- వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన సేవలు
- త్వరలో అదనపు సిబ్బందిని నియమిస్తాం
- 'సాక్షి'తో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్




ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, కొత్త సంవత్సరంలో ప్రత్యేక ప్రణాళి కతో ముందుకెళ్తున్నానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజ య్‌కుమార్ అన్నారు. న్యూఇయర్ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. 'విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కోరుట్లలోని వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన సేవలందించడానికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకుంటా. మెట్‌పల్లిలో రూ.7కోట్లతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయిస్తా. రెండు మున్సిపాలిటీల్లో ప లు అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం రూ.30కోట్లు మంజూరు చేసింది. వాటి ని విడుదల చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరాను. గ్రామాల్లో వసతులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించాను.

పక్కా ప్రణాళికతో ముందుకెళ్తా..

- గోదావరి పరిశుభ్రతకు ప్రాధాన్యం
- మురికినీరు చేరకుండా చర్యలు
- న్యూఇయర్ సందర్భంగా ధర్మపురి ఎమ్మెల్యే 'అడ్లూరి'



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే

ధర్మపురి/గొల్లపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నానని, సమస్యలన్నింటినీ ప్రాధాన్య పరంగా పరిష్కరించుకుంటూ వెళ్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ధర్మపురి వద్దగల గోదావరి అపరిశుభ్రంగా మారింది. ఎల్లప్పుడు శుభ్రంగా ఉండేలా ప్రాధాన్యం ఇస్తా. వచ్చే పుష్కరాల వరకు గోదావరిలో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా. ధర్మపురికి డిగ్రీ కళాశాల తీసుకొస్తా. రాత్రి తొమ్మిది గంటలు దాటితే ధర్మపురికి ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. సమస్య పరిష్కారానికి ధర్మపురిలో బస్సు డిపో ఏర్పాటుకు కృషి చేస్తా. కరీంనగర్ – రాయపట్నం రహదారిని ఆనుకుని 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తాను. పాసిగామలో ఓ ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే ఆలోచ న ఉంది. పత్తిపాక రిజర్వాయర్ ద్వారా ధర్మారం వెల్గటూర్, ఎండపెల్లి మండలాల రైతులకు నీరందించే విధంగా చర్యలు తీసుకుంటా.

రైతు సమస్యలు పరిష్కారం



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా వివిధ దశల్లో ఉన్న పనులు పూర్తి చేయించి జిల్లాలోని రైతాంగానికి సాగునీరు అందిస్తాం. మల్రిపల్లి ప్రాజెక్టు, కలికోట సూరమ్మ చెరువు, లచ్చపేటతండా రిజర్వాయర్, మల్కపేట రిజర్వాయర్ పనులు పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందేలా చూస్తా. సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వ చీరల ఆర్డర్లు ఇస్తాం. ఇప్పటికే నూలు డిపో ఏర్పాటు చేశాం. నేతన్నల ఉపాధికి భరోసా కల్పిస్తాం. అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తాం. పారదర్శకంగా ప్రజాపాలనను అందిస్తాం.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

కొండగట్టు అభివృద్ధికి కృషి



చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలుపుతాను. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు ఇలవేల్పు అయిన కొండగట్టు దేవస్థానంలో అభివృద్ధి చర్యలు చేపడతాను. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తాను. చొప్పదండి పరిధిలో రోడ్లు, సాగునీరు, విద్య తదితర రంగాలలో మెరుగైన ప్రగతి సాధిస్తాము. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

వరి నారుతో ఎమ్మెల్యేపై అభిమానం



మల్యాల: తాటిపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు కంచర్ల లక్ష్మణాచారి తన పొలంలో వరి నారుతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరు రాసి అభిమానం చాటుకున్నారు. పొలంలో నాటు వేయకముందే ముందస్తుగా తన అభిమానాన్ని చాటుకునేందుకు డాక్టర్ మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే, చొప్పదండి అక్షర రూపంలో వరి నాట్లు వేశారు.

పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తిదాయకం

• ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతమని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విరమణ పొందుతున్న ఎస్సైలు సలీం, అబ్దుల్ రషీద్‌ను శాలువా, పులమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పోలీసు వాహనంలో బ్యాండ్‌తో వీడ్కోలు పలికారు. అడిషనల్ ఏఆర్ ఎస్పీ భీమ్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, సీసీఎస్ ఎస్సై రవీందర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం

గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు శాఖాపరంగా భద్రతపరమైన ఏర్పాట్లు చేయగా.. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను సత్కరించారు. డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్, ఉమాసాగర్, శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ట్రస్ట్ సభ్యుడు కాంతయ్య పాల్గొన్నారు.


సలీం, అబ్దుల్ రషీద్‌ను సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

హత్య కేసులో ఒకరికి యావజ్జీవం

జగిత్యాలజోన్: మద్యం సేవించి.. ఎదుటి వ్యక్తితో గొడవ పడడంతోపాటు అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం .. బుగ్గారం మండలంలోని శెకెల్ల గ్రామానికి చెందిన మైదం శంకరయ్య, కల్లెం లచ్చయ్య మామా అల్లుళ్లు. ఇద్దరూ వ్యవసాయం చేసుకుని జీవిస్తారు. 2018 సెప్టెంబర్ 27న ఇద్దరు కలిసి గ్రామంలో మద్యం తాగుతుండగా.. వీరికి సమీపంలోనే అదే గ్రామానికి చెందిన ఓద్నాల పోచమల్లు, మరికొందరు వ్యక్తులు మద్యం సేవిస్తున్నారు. శంకరయ్య వద్దకు వచ్చిన పోచమల్లు కారణం లేకుండానే ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శంకరయ్యను లచ్చయ్య ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి ఇంటి వద్ద దింపాడు. వెనుకే వచ్చిన పోచమల్లు కత్తితో శంకరయ్యను పొట్టలో పొడిచాడు. లచ్చయ్య, కుటుంబసభ్యులు అరవడంతో పోచమల్లు పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన శంకరయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు బుగ్గారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై కె.రవీందర్ కేసు నమోదు చేశారు. సీఐలు సిహెచ్. నాగేందర్, టి.లక్ష్మీబాబు కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు వి.శ్రీధర్, ఎం.కిరణ్‌కుమార్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో పోచమల్లుకు యావజ్జీవంతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.



నిధులు మంజూరు చేయండి

జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గంలోని రహదారులు, బ్రిడ్జి నిర్మాణాలకు రూ.44కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గోవిందుపల్లి బ్రిడ్జి, నర్సింగాపూర్ బ్రిడ్జి, హన్మాజీపేట, లచ్చక్కపేట, సంగంపల్లి బ్రిడ్జిలు, ఇతర రహదారుల నిర్మాణాల కోసం రూ.44కోట్లు అంచనా వేశామని, మంజూరు చేయాలని కోరారు. వచ్చే బడ్జెట్‌లో ప్రతిపాదనలు ప్రవేశపెట్టి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి: భీమారం మండలకేంద్రంలో మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్‌ల కథనం ప్రకారం భీమారానికి చెందిన ఆకునూరి బూమరాజం, అదే గ్రామానికి చెందిన బాలుడు ద్విచక్రవాహనాలపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో బూమరాజం(42) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగానే చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాలుడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జోగిన్‌పల్లిలో యువకుడికి కత్తి పోట్లు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన నల్ల నవీన్ కత్తి పోట్లకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. నవీన్ మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై పైడిమడుగు మీదుగా కోరుట్లకు వస్తున్నాడు. పైడిమడుగుకు చెందిన ఇద్దరు యువకులు తమను ఎందుకు చూస్తున్నావని గొడవ పడుతూ వెంబడించారు. మాదాపూర్ శివారులోని కోళ్ల ఫారం వద్ద నవీన్‌ను అటకాయించి కత్తితో పొడిచి పారిపోయారు. స్థానికులు గమనించి నవీన్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని యువకులు వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


గాయపడిన నల్ల నవీన్





డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు

ధర్మపురి: డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

వస్త్ర దుకాణం యజమానికి రూ.20వేల జరిమానా

రాయికల్: పట్టణంలోని రాజేశ్ అనే వస్త్ర దుకాణం యజమానికి రూ.20 వేల జరిమానా విధించినట్లు కమర్షియల్ ట్యాక్స్ జిల్లా అధికారి ఆనందరావు తెలిపారు. జీఎస్టీ నిబంధనలు పాటించలేదని రుద్రవేణి సృజన్ ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీ నిర్వహించి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కుక్క పిల్లలకు బారసాల

మల్లాపూర్: కుక్క పిల్లలకు బారసాల నిర్వహించిన ఘటన మండలంలోని పాతదాంరాజుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ద్యావనపెల్లి ప్రతాప్–సుజాత దంపతులకు కుమార్తె రష్మిక, కుమారుడు రాహుల్ ఉన్నారు. వీరికి తమ ఇంట్లో పెరిగే కుక్కంటే ప్రేమ. ఆ కుక్క 21రోజుల క్రితం ఐదు కూనలకు జన్మనిచ్చింది. వాటికి కొత్త బట్టలు కుట్టించి బారసాల చేశారు. సుమారు 100 మంది బంధుమిత్రులను ఆహ్వానించి నామకరణం చేశారు.


పాతదాంరాజుపల్లిలో కుక్క పిల్లలతో ద్యావనపెల్లి ప్రతాప్–సుజాత దంపతులు

సేవతోనే గుర్తింపు

జగిత్యాల: సేవతోనే ప్రతి ఒక్క ఉద్యోగికి గుర్తింపు వస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు పోచయ్య, గంగయ్య విరమణ పొందగా.. ఘనంగా సన్మానించారు. కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి







భవనంపై నుంచి పడి వృద్ధుడి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని గణేశ్‌నగర్‌లో నివాసముంటున్న బండారి నర్సయ్య(70) ఇంటిపై నుంచి పడి మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్‌కు చెందిన బండారి సత్యనారాయణ వ్యాపారం నిమిత్తం గణేశ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఆయన తండ్రి నర్సయ్య కొద్దిరోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. సోమవారం రాత్రి సమయంలో ఇంటిపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఆయనను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి

మల్లాపూర్: మండలకేంద్రం శివారులో గతనెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు గొర్రె రాజం(58) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్సై రాజు తెలిపారు. గుండంపల్లికి చెందిన రాజం ద్విచక్రవాహనంపై మండలకేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కథలాపూర్ మండలానికి చెందిన కోటగిరి శివకుమార్ కారులో వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాజంను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేదు. రాజం సోదరుడు తుక్కన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


రాజం(ఫైల్)









